ఉదాత్త సాహిత్యంతో సృష్టించిన గీతాలంటే ఎంతో అభిమానం, ఇంకా ఇంగ్లీష్ లో చెప్పాలంటే "PASSION " ఉన్న ప్రముఖ గాయని శ్రీమతి శారద ఆకునూరి. శ్రీ మృత్యుం జయరావు, శ్రీమతి రమాదేవి దంపతులకు తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో జన్మించిన శారద ఆకునూరి , గుంటూరు జిల్లా బాపట్ల లో మరియు చిత్తూరు జిల్లా తిరుపతిలోనూ విద్యనభ్యసించారు.

మూడేళ్ళ లేలేత ప్రాయం లోనే పాటలు పాడటం అభ్యసించిన వీరు భక్తి, లలిత, సినిమా పాటల పోటిలలో అనేక మార్లు రాష్ట్రస్థాయి బహుమతులను గెలుచుకున్నారు. వ్యాసరచన మరియు నృత్య పోటీల్లో పాల్గొని పలువురి ప్రముఖుల ప్రశంస లందు కొన్నారు. ఆకాశవాణి విజయవాడ కేంద్రం లో యువవాణి కార్యక్రమం లో లలిత గీతాలు ఆలపించి అతికొద్ది కాలంలోనే రేడియో ఆడిషన్ లో కృతార్థురాలై రేడియో గాయని గా అనేక లలిత గీతాలు ఆలపించారు. ఇవేకాక స్నేహం, అక్షరాస్యత మీద అనేక యువవాణి రేడియో నాటికలలో ప్రధాన పాత్ర పోషించారు. తన గాత్రం తో ఆకాశవాణి శ్రోతలతో పాటు టీవి ప్రేక్షకులను కూడా ఈ టీవి వారి సరిగమలు సినిమా పాటలు, సినిమాల క్విజ్ లో ప్రథమస్థానం, జెమినీ టీవి వారి నవరగంలో పాల్గొని అలరించారు. హైదరాబాద్ దూరదర్శన్ లో టెలీ స్కూల్ కార్యక్రమాలు, మహిళా కార్యక్రమాల తో పాటు పలు సినీ ప్రముఖులు, జగపతిబాబు, KM రాధాకృష్ణన్, రాజా, కోటి గారు వంటి వారిని, ప్రముఖ పారిశ్రామిక వేత్తలను ఇంటర్వ్యూ చేసి తన ప్రశ్నావళి ద్వారా ప్రముఖుల అంతరంగాలను అద్భుతంగా ఆవిష్కరించారు. సిటీ కేబుల్ న్యూస్ రీడర్ గా, గేమ్ షో హోస్ట్ గా, యాంకర్ గా ప్రేక్షకాభిమానాన్ని పొందారు.

వివాహానంతరం అమెరికాలో అడుగుపెట్టి, Houston టాలెంట్ స్టార్ సెర్చ్ లో ప్రథమ స్థానం పొంది విజేతగా నిలిచారు. తెలుగు భాష సంస్కృతి మీద మక్కువతో అక్కడ కూడా పరిరక్షించాలి, పెంపొందించాలి అనే సదుద్దేశంతో హ్యూస్టన్ తెలుగు సాంస్కృతిక సమితి లో సాంస్కృతిక కార్యదర్శి గా చేసి, తర్వాత రెండు సంవత్సరముల పాటు అధ్యక్షురాలిగా పనిచేసారు.ఆ నేపథ్యం లో మన సంస్కృతికి అద్దంపట్టే పండుగలు సంక్రాంతి, ఉగాది వంటి పండుగలతో పాటు వాగ్గేయకారోత్సవం, సిద్ధేంద్రయోగి జయంతోత్సవం,

వనభోజనాలు, ఇమ్మిగ్రేషన్ సెమినార్ వంటి ఎన్నో కార్యక్రమాలతో పాటు సినీ దిగ్గజాలు కళాతపస్వి శ్రీ కే. విశ్వనాధ్, శ్రీ మురళి మోహన్, శ్రీ గొల్లపూడి మారుతీరావు, శ్రీ జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, హాస్య నటులు AVS తదితరులు పాల్గొన్న అపురూప సాంస్కృతిక కార్యక్రమం "తారలు దిగి వచ్చిన వేళ ", శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారి సంగీత కచేరి, దాదా సాహెబ్ పాల్కే అవార్డు గ్రహీత అందరి అభిమాన నటులు శ్రీ అక్కినేని నాగేశ్వరరావు గారిని ఆహ్వానించి సత్కరించడం, గురువు రామాచారి గారితో సంగీత శిక్షణ వర్కుషాప్స్, తెలుగుబడి పాఠ్య ప్రణాళికను అభివృద్ధి చేయడం , మధురవాణి పత్రికను TCA 35 వ వార్షికోత్సవ సంచికగా ప్రచురించడం వంటి ఎన్నో కార్యక్రమాలు చేశారు.

మీనాక్షి దేవస్థానం వారి VEDIC HERITAGE SCHOOL లో రామాయణం, భారతం, భాగవతం భోధించే అధ్యాపకురాలిగా పనిచేసారు. హ్యూస్టన్ తెలుగు రేడియో లో రేడియో జాకీగా శ్రోతలకు అలనాటి మధురగీతాలను వినిపిస్తూ మెదడుకు పదును పెట్టే పొడుపుకధలతో రకరకాల ఆటలతో ప్రతి శనివారం అలరిస్తారు. అమెరికా రేడియో లో మొట్టమొదటి సారిగా పాటలు పోటీలు నిర్వహించి భళా అనిపించుకున్నారు. 19 వ TANA ద్వైవార్షిక సభలకు కల్చరల్ చైర్ గా, NATA మహాసభల్లో సాంస్కృతిక కార్యదర్శి గా వ్యవహరించారు. TANA చైతన్య స్రవంతి కి సాంస్కృతిక కార్యదర్శి గా ఆంధ్రప్రదేశ్ లో వివిధ ప్రాంతాలలో భాష, సంస్కృతి సేవ పరమైన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇటీవల జరిగిన 20 వ TANA మహాసభల్లో దీంతానా అడ్వైసర్ గా వుండి సంగీత పోటీలు నిర్వహించారు. అమెరికా తెలంగాణ అసోసియేషన్ ద్వైవార్షిక మహాసభలకు 2019 లో కల్చరల్ చైర్ గా పని చేశారు.

అమెరికా లో ఉంటూ కూడా తనకు పాటల పట్ల ఉన్న మక్కువతో తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో, అమెరికా లో ఉన్న అన్ని నగరాల్లో, కెనడా లో, ఇండియా లో వందలాది విభావరుల్లో పాల్గొన్నారు. P

సుశీల, కోకా జమునారాణి, రామకృష్ణ మనో, ఘంటసాల రత్నకుమార్, మల్లికార్జున్, శ్రీకృష్ణ, హేమచంద్ర వంటి ప్రముఖ నేపధ్య గాయనీ గాయకులతో గొంతు కలిపి ఎన్నో సంగీత విభావరులు చేసి సంగీత ప్రియుల ప్రసంశలు అందుకున్నారు.

అమెరికాలో బహుళ ప్రజాదరణ పొందిన తెలుగు టైమ్స్ పత్రిక 9 వ వార్షికోత్సవం సందర్భంగా, అమెరికాలో 9 మంది ప్రముఖుల జాబితాలో వీరు ఉండటం విశేషం.

డల్లాస్ లో జరిగిన అంతర్జాతీయ మహిళా సంబరాల్లో "commitment and contribution to the empowerment of women" పురస్కారాన్ని మధుర గాయని P .సుశీలగారి తో, అక్కినేని గారి 89 వ పుట్టిన రోజు సందర్భంగా TANA కమ్యూనిటీ సర్వీస్ పురస్కారాన్ని శ్రీ అక్కినేని నాగేశ్వరరావు చేతులమీదుగా అందుకున్నారు.

దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత శ్రీ ANR గారి 90వ పుట్టినరోజు, పద్మశ్రీ SP బాలు గారికి పెండ్యాల పురస్కారం, అందాల నటి జమున గారికి ఆదుర్తి పురస్కారం, ప్రముఖ నటులు కోట శ్రీనివాస్ రావు గారికి అల్లురామలింగయ్య పురస్కారం, కమెడియన్ అలీ కి lifetime acheivement పురస్కారం, సేఫ్ NGO వారి వేటూరి గీతాంజలి, దర్శకరత్న దాసరి స్వరాభిషేకం, ప్రముఖ సంగీత దర్శకులు శ్రీ రాజన్ గారి సమక్షంలో జరిగిన రాజన్ - నాగేంద్ర సినీగీత వైభవం, స్వర్ణయుగ సంగీత దర్శకులు సత్యం , రమేష్ నాయుడు, మహదేవన్, ప్రముఖ గీత రచయితలు దాశరధి, సినారె వేటూరి వంటి వారికి పూర్తిస్థాయి ప్రతిష్టాత్మక సంగీత విభావరులలో ప్రధాన గాయనిగా పాల్గొని అశేష అభిమానులను చూరగొన్నారు. 2014 లో మెలోడీ బ్రహ్మ మణిశర్మ, సుస్వరాల కోటి గారితో పాటు వంశీ వారి ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు.

ప్రయోగాల సంగీత దర్శకులు శ్రీ MS విశ్వనాథన్ సమక్షంలో చెన్నై లో ఆంధ్ర కల్చరల్ క్లబ్ వారు నిర్వహించిన సంగీత విభావరిలో పాల్గొని ఆయన చేతుల మీదగా పురస్కారం స్వీకరించారు.

భారత దేశ ఉప రాష్ట్రపతి శ్రీ వెంకయ్య నాయుడు గారు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావు గారు, మహారాష్ట్ర గవర్నర్ శ్రీ విద్యాసాగరరావు గారు, తమిళనాడు గవర్నర్ శ్రీ కే రోశయ్య గారు, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీమతి తమిళిశై సౌందర్యరాజం వంటి ప్రముఖుల సమక్షంలో సంగీత విభావరులు చేశారు.

2023 లో నటరత్న NT రామారావు గారి శత జయంతి సందర్భంగా సహజనటి జయసుధకు NTR పురస్కారం కార్యక్రమం రూపొందించి,ఆ సందర్భంగా సంగీత విభావరి, అలాగే సినీ దిగ్గజం మురళీమోహన్ గారి 50 వ చలనచిత్ర వార్షికోత్సవ వేడుకలలో సంగీత విభావరి సమర్పించి ప్రముఖుల మన్ననలు పొందారు

2024 లో ప్రముఖ దర్శకులు శ్రీ కోదండరామిరెడ్డి గారి స్వర్ణోత్సవ వేడుకలు, 2025 లో దర్శకుడు పసలపూడి వంశీ సినీ ప్రధాన స్వర్ణోత్సవ వేడుకలలో ఆయన్ని ఆహ్వానించి, సత్కరించి అద్భుతమైన పూర్తి స్థాయి సంగీత విభావరిని నిర్వహించారు. వైజాగ్ లో జరిగిన గుంటూరు మెడికల్ కాలేజీ రీయూనియన్ లో ప్రధాన గాయనిగా మరియు వ్యాఖ్యాత్రి గా వ్యవహరించారు. ఈటీవీ స్వరాభిషేకం లో స్పెషల్ ఎపిసోడ్స్ లో గాయని గా పాల్గొన్నారు

సంగీతమే కాకుండా సాహిత్యం మీద కూడా మక్కువ కలిగిన శారద ఆకునూరి గారు పలు పుస్తకాల ప్రచురణకు సహాయ సహకారాలు అందించారు. డా! సి. నారాయణ రెడ్డి గారి గారి "క్షేత్ర బంధం" కవిత సంపుటి మొదటి ప్రతిని ఆయన చేతుల మీదుగా అందుకున్నారు. మల్లాది రామకృష్ణ గారి "మది శారద దేవి మందిరమె " మదిలో వీణలు మ్రోగే...దాశరధి గారి పుస్తకాలు ప్రచురణలో ప్రధాన భూమిక గా ఉండి మొదటి ప్రతులను అందుకున్నారు. "నేలమీది

జాబిలి నింగి లోని సిరిమల్లె" అక్కినేని శత గీత  లహరి పుస్తకాన్ని ప్రచురించి దానిపై వచ్చే ఆదాయం వృద్ధ కళాకారులకు చెందేటట్లు చేశారు. సంగీత దర్శకులు శ్రీ KV మహదేవన్ శతజయంతి సందర్భంగా "సరిలేరు నీకెవ్వరూ..మహదేవన్ ఆణిముత్యాలు" పేరిట  పుస్తకాన్ని ప్రచురించి దానిపై వచ్చే ఆదాయం వికలాంగులకు చెందేటట్లు చేశారు.  మహదేవన్ గారి మీద పుస్తకం తెలుగు రాష్ట్రాలలో లైబ్రరీలకు ఎంపిక అయినది.

వికలాంగుల సహాయార్థం వేగేశ్న ఫౌండేషన్ తరఫున అమెరికాలో  ఇరవై ఐదు నగరాల్లో జరిగిన ఘంటసాల ఆరాధనోత్సవాలు మరియు బాలు సంగీతోత్సవాల్లో ప్రధాన గాయనిగా పాల్గొని ఆ కార్యక్రమాలు విజవంతం కావడానికి సహకరించినందుకు గాను సంస్థ నిర్వాహకులు ఆమెను "గాన రత్న " పురస్కారం తో సత్కరించారు.

న్యూజెర్సీ బోర్డ్ ఆఫ్ పబ్లిక్ యుటిలిటీస్ కమిషనర్ శ్రీ ఉపేంద్ర చివుకుల గారు వేదికపై ఆమెకు “అమెరికా గాన కోకిల” బిరుదుతో సత్కరించారు.

ప్రాగ్నిక ఫౌండేషన్ హైదరాబాద్ వారు "గాంధర్వ రస వర్షిణి"  బిరుదు తో సత్కరించారు. 2026 , జనవరి లో దివి సీమ గాంధీ శ్రీ మండలి కృష్ణారావు గారి శతదినోత్సవం సందర్భంగా  పురస్కారాన్ని అందుకున్నారు.

అక్కినేని ఫౌండేషన్ అఫ్ అమెరికాలో బోర్డు అఫ్ డైరెక్టర్ గా కీలక పాత్ర పోషిస్తు, 2019  కి గాను అధ్యక్షురాలిగా పలురకాలైన ప్రజోపకరమైనటువంటి , నాగేశ్వరరావు గారిని గుర్తుకుతీసుకువచ్చే ముఖ్య కార్యక్రమాలను రూపొందించి  వివిధ రంగాల్లో లబ్ధ ప్రతిష్టులైన వారికి  పురస్కారాలతో సత్కరించారు

ప్రతిష్టాత్మకమైన ఈటీవీ  స్వరాభిషేకం కార్యక్రంలో పలు సినీగీతాలు ఆలపించారు

ఈటీవీ వారి రాగం తానం పల్లవి కార్యక్రమంలో సృజనాత్మక విభాగం లో గురుతర భాద్యత పోషిస్తున్నారు.

శ్రీమతి శారద ఆకునూరి అమెరికాలో తొలిసారిగా '**పాడుతా తీయగా**' కార్యక్రమాన్ని చివరి తొమ్మిది ఎపిసోడ్ లను విజయవంతంగా నిర్వహించి, సంగీతం మరియు సాంస్కృతిక ప్రోత్సాహానికి ఆమె చేసిన కృషికి విశేష ప్రశంసలు పొందారు.

వేదికపై మాత్రమే కాకుండా, ఆమె తన గాన ప్రతిభను అనేక సామాజిక సేవా కార్యక్రమాల కోసం కూడా వినియోగిస్తూ వచ్చారు. ఆమె **సంకర నేత్రాలయ**, **ఏకల్ విద్యాలయ**, **వేగేశ్న ఫౌండేషన్**, **సంకర ఐ ఫౌండేషన్**, అలాగే **మీనాక్షి ఆలయం** కోసం నిర్వహించిన నిధుల సేకరణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మీనాక్షి ఆలయం కోసం జరిగిన కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి మరియు కొన్ని నిర్మాణాల పునర్నిర్మాణానికి నిధులు వినియోగించబడ్డాయి.

అదేవిధంగా, ఆమె **HUDHUD తుపాను ప్రభావితుల సహాయార్థం** నిర్వహించిన నిధుల సేకరణ కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొని, మానవతా సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారం అందించారు. ఆమె గాన ప్రదర్శనలు దివ్యాంగుల సంక్షేమం, నేత్ర చికిత్సలు మరియు నేత్రదానం, పేద పిల్లల విద్య, విపత్తు సహాయం వంటి అనేక సామాజిక కార్యక్రమాలకు అవగాహన మరియు నిధుల సేకరణకు తోడ్పడ్డాయి.

తన సంగీతం ద్వారా, ఆమె కళాత్మక ప్రతిభను మానవతా సేవా భావంతో మరియు సాంస్కృతిక సేవతో సమన్వయం చేసి ఆదర్శంగా నిలిచారు.